కథ

**జె. సునీల్**

# ముందు చూపు

ఇంటి నుండి వచ్చిన ఫోన్ రామ్మోహన్‌లో కంగారు పుట్టించింది. సుమిత్ర 'వెంటనే ఇంటికి రండి' అంటూ ఫోన్ పెట్టేసిందే తప్ప, విషయమేమీ చెప్పలేదు. కానీ భార్య గొంతులో కదలాడిన భయం, కంగారు అతడికి అర్థమయ్యాయి. అందుకే ఆఫీసులో అర నిమిషం కూడా ఉండదలచుకోలేదు. ''ఈ రోజుకి అపాయింట్‌మెంట్స్ అన్నీ కేన్సిల్ చేయుము''ని సెక్రటరీకి చెప్పి, అక్కడి నుండి బయటపడ్డాడు.

పావుగంటలో ఇల్లు చేరుకున్నాడు.

కారు శబ్దం వినిపించగానే సుమిత్ర ఇంట్లోంచి బయటకు పరుగెత్తుకొచ్చింది. తమ పాతికేళ్ల దాంపత్య జీవితంలో ఆమె అలా పరుగెత్తుకురావటం మొదటిసారి. అందువల్లే అతడి గుండె వేగం కొద్దిగా పెరిగింది.

''ఏమయ్యింది సుమిత్రా'' కారు దిగి వడివడిగా ఆమె వైపు నడుస్తూనే ప్రశ్నించాడు.

''మన...మన అమ్మాయి... ఇంతవరకూ ఇంటికి రాలేదండీ'' సుమిత్ర స్వరంలో వణుకు స్పష్టంగా కనిపిస్తుంది.

'ఉదయమే కాలేజీకి వెళ్లి, మధ్యాహ్నానికి ఇంటికి చేరుకునే శ్రావణి సాయంత్రం ఐదింటి వరకూ ఇంటికి రాకపోవడమేమిటి?' క్షణకాలంలోనే మనసు పరిపరివిధాలా ఆలోచించింది. అందులోనూ ఈమధ్య కాలంలో పెరిగిన కిడ్నాప్ వ్యవహారాలు మనసులో ఒక్కసారిగా కదలాడాయి. గుండె వేగం మరింత పెరిగింది.

అప్పటికీ అతికష్టం మీద గొంతు పెగల్చుకుని ''శ్రావణి ఇప్పటివరకూ ఇంటికి రాకపోవడమేమిటి? ఒకవేళ తన ఫ్రెండ్స్ ఇంటికి వెళ్లిందేమో.. ఒక్కసారి తన సెల్‌కి కాల్ చేయకూడదూ?'' అన్నాడు. తన కూతురేమీ చిన్నపిల్ల కాదు. మొన్ననే ఆమెకు పద్దెనిమిదేళ్లు నిండాయి.

''నేను మధ్యాహ్నం నుండి ట్రై చేస్తూనే ఉన్నాను. తన ఫోన్ స్విచ్ఛాఫ్ ఉంది. ఫ్రెండ్స్‌కి ఫోన్ చేశాను. వాళ్లెవ్వరికీ శ్రావణి గురించి తెలియదట. అంతేకాదు... ఈరోజు తను కాలేజీకి కూడా వెళ్లలేదట''

ఆమె ఆ మాటలు చెపుతున్నప్పుడే అతడు యధాలాపంగా భార్య ముఖంలోకి చూశాడు. చిరు అనుమానం క్షణంలో పెరిగి పెద్దదయింది. ఆమె ముఖంలో కంగారుతో పాటు, ఏదో చెప్పలేక తడబడటం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే అతడు అడిగాడు. ''సుమిత్రా నువ్వు.. నువ్వేదో దాస్తున్నట్టున్నావ్.. ఏం జరిగిందో నాకు క్లియర్‌గా చెప్పు''

సుమిత్ర మెల్లగా వెనుతిరుగుతూ చెప్పింది. ''మీరు ముందు ఇంట్లోకి రండి.''


అతడు ఆమె వెనుకే ఇంట్లోకి నడిచాడు.

కూతురు రూమ్‌లోకి భర్తను తీసుకెళ్లాక సుమిత్ర కప్‌బోర్డ్స్ తెరిచింది.

అటుకేసి చూసిన రామ్మోహన్ అదిరిపడ్డాడు. ఆ కప్‌బోర్డ్స్ చాలావరకూ ఖాళీగా ఉన్నాయి. అక్కడ ఉండవలసిన బట్టలు, నగలు, సర్టిఫికేట్స్ లేవు. అంటే?! ఆ క్షణమే మనసులో కదలాడిన భావం, తనువంతా వణికేలా చేసింది.

అప్రయత్నంగానే భార్య ముఖంలోకి చూశాడు. ఆమె తలదించుకుని చెప్పింది. ''అమ్మాయి ఇల్లు వదిలి వెళ్లిపోయిందని అర్థమవుతోంది''

''ఎం..దు..కు?!''



తనూ ఒక్కో పదమే కూడబలుక్కుంటూ చెప్పింది. ''బహుశా ప్రేమ వ్యవహారం అనుకుంటా''

అతడు పక్కనే ఉన్న బెడ్ మీద నీరసంగా కూలబడ్డాడు.

★ ★ ★

ఒక వాస్తవం అర్థమవుతూనే ఉంది. కానీ అంగీకరించడానికి మన స్సరించటం లేదు. 'తమ అను మానం అబద్ధం కావాలని' వేయి దేవుళ్లకు మొక్కుకున్నారు. శ్రావణి కోసం ఆ రాత్రంతా ఎదురుచూశారు.

శ్రావణి రా..లే..దు.

ఆ రాత్రే కాదు మరో రెండు రోజులు వారు కూతురు కోసం ఎదురుచూశారు. ఎంక్వయిరీ చేశారు. వెతుకులాడారు. కానీ ఆమె జాడ తెలియలేదు.

ఆ దంపతులు క్రుంగిపోయారు. ముఖ్యంగా రామ్మోహన్‌కి మనసులో ఎన్నెన్నో భావాలు కదలాడుతున్నాయి. 'తను అట్టడుగు స్థాయి నుండి జీవితాన్ని మొదలుపెట్టాడు. కోట్లు సంపాదించాడు. ఈ సంపాదనంతా ఎవరి కోసం? రేపు తనేం వెంటపెట్టుకుని పోడు కదా? ఈ ఆస్తంతా శ్రావణికే ఇచ్చి వెళ్తాడు.. ఇదేదీ శ్రావణికి అర్థం కాలేదా? అర్థమయ్యీ ఇంత ఆస్తిని కూడా వదులుకుని ఎవడితోనో వెళ్లిపోయిందా?'

కాలానికున్న గొప్పతనమే అది. ఎంత బాధనైనా కొంత తగ్గిస్తుంది. ఒకవేళ మనసులో ఎంత బాధ ఉన్నా, బాధ్యతలన్నింటినీ పక్కన పెట్టలేం. బిజినెస్ మరింత బాధ్యతతో కూడుకున్నది. అందుకే రామ్మోహన్ ఆఫీసుకెళ్లాడు.

ఛాంబర్‌లో కూర్చున్న పావుగంట తర్వాత ధీరజ్ లోపలికి వచ్చాడు. ''గుడ్ మార్నింగ్ సార్''

''గుడ్‌మార్నింగ్'' తన కూతురు ఇల్లు వదిలిన విషయం, ఆఫీసులో ఎవ్వరికీ తెలియదు. అందువల్లే అతడు అంతగా ఇబ్బంది పడడం లేదు.

''చాలా డల్‌గా కనిపిస్తున్నారు. రెండు రోజులు ఆఫీసుకి కూడా రాలేదు. మీ ఆరోగ్యం..?'' ధీరజ్ బాస్ ముఖంలోకి అదోలా చూశాడు.

''చిన్న అనారోగ్యం...'' అనేసి ఆ టాపిక్‌ని డైవర్ట్ చేయడం కోసమన్నట్టు వెంటనే అడిగాడు.

''ఏమిటి ధీరజ్?..ఏదైనా విశేషమా?''

ధీరజ్ తన కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్. ఏదో విశేషం లేకుండా తన ఛాంబర్‌లోకి రాడు. అందుకే అడిగాడు అలా.

ఆ విషయం ఎలా చెప్పాలో అర్థంకానట్టు పది సెకనులు అదోలా ముఖం పెట్టి, ఆ తర్వాత చెప్పాడు. ''సార్! నేనీ ఉద్యోగానికి రిజైన్ చేయబోతున్నాను''





రామ్మోహన్ ఉలికిపడ్డాడు. తలెత్తి ధీరజ్ ముఖంలోకి చూస్తూ ''ఉద్యోగం మానేస్తున్నావా? ఎందుకు?'' ప్రశ్నించాడు.

''సొంతంగా బిజినెస్ స్టార్ట్ చేద్దామని అనుకుంటున్నాను సార్''

అతడేమంటున్నాడో రామ్మోహన్‌కి మొదట అర్థం కాలేదు. అర్థమయ్యాక అయోమయంగా చూశాడు. 'తనకి తెలిసినంతలో ధీరజ్‌కి బిజినెస్ చేసేంత పెట్టుబడి లేదు. మరిప్పుడు అతడెలా బిజినెస్ స్టార్ట్ చేయాలనుకుంటున్నాడు?'

ఆ విషయాన్నే కాస్త స్మూత్‌గా అడిగాడు.



''బిజినెస్ అంటే పెట్టుబడి కావాలి కదా ధీరజ్! నీ దగ్గర పెట్టుబడి ఉందా?''

''నాకు కాబోయే మామగారు కోటీశ్వరుడు కదా సార్! పెట్టుబడికి ప్రాబ్లమ్ లేదు''

తనకేదో మరో కొత్త విషయమూ తెలుస్తున్నట్టనిపించింది.

''అంటే...అంటే నీకు పెళ్లి కూడా ఫిక్సయ్యిందా?''

''అవును సార్! వచ్చే నెలలోనే పెళ్లి. మీరు మా పెళ్లికి తప్పకుండా రావాలి'' అతడి ముఖంలో సిగ్గే కాదు, మరేదో సాధించానన్న ఆనందమూ కనిపిస్తోంది.

అప్పటివరకూ ధీరజ్ నిలబడే ఉన్నాడు.

''కూర్చో'' అన్నాడు రామ్మోహన్.

''పర్వాలేదు సార్''

## దటీజ్ నేహా!

**2002లో 'మిస్ ఇండియా' కిరీటం సొంతం చేసుకున్నాక బాలీవుడ్‌లోకి వచ్చిన నేహా ధుపియా 'విలన్' అనే తెలుగు సినిమాలోనూ నటించింది. బాలీవుడ్‌లో ప్రస్తుతం బిజీగా వున్న నేహా తన గ్లామర్ గురించి నిక్కచ్చిగా ఎలాంటి భేషజాలు లేకుండా చెప్పిందీమధ్య. 'నేను మరీ అంత గొప్ప అందగత్తెని కాను. ఏదో చూడ్డానికి కాస్త బావుంటానంతే. నా దృష్టిలో లిసారే, ఐశ్వర్యారాయ్ లాంటి వాళ్లు అసలైన అందగత్తెలు' అని సిన్సియర్‌గా తన గురించి తను కామెంట్ చేసుకుంది. గ్రేట్ కదూ!**

''కూర్చోవయ్యా'' అతడి నుండి తెలుసుకోవలసింది చాలా ఉందనిపించే అలా అన్నాడు.

ధీరజ్ కూర్చున్నాడు. రామ్మోహన్ అడిగాడు. ''మీది పెద్దలు కుదిర్చిన వివాహమా?''

''భలే వారే సార్! పెద్దలు కుదిర్చిన వివాహాల్లో కోటీశ్వరుడి కూతుర్ని, కామన్ మేన్‌కి ఇవ్వటం ఎక్కడైనా జరుగుతుందంటారా? నో..నో! మాది ప్రేమ వివాహం''

'తన కూతురూ ఎవడినో పెళ్లి చేసుకుంది. వాడూ, వీడిలాగే సామాన్యుడే అయి ఉంటాడు. ఒక కోటీశ్వరుడి కూతురు, ఓ సామాన్యుడిని ఎందుకు ప్రేమించి, పెళ్లి వరకూ వెళ్తోంది. అంటే ఈమధ్య జరుగుతున్న ఈ తరహా ప్రేమ వివాహాలలో తప్పెవ

రిది? కన్న వాళ్లదా? ప్రేమించిన ఆ అమ్మాయిదా? ఒకవేళ ట్రాప్ చేశాడనుకున్నా లేక నిజంగానే ప్రేమించాడనుకున్నా... ఆ అమ్మాయిని అంతగా తన వైపు తిప్పుకున్న ఆ కుర్రాడిదా? త..ప్పె)...వ..రి....ది?'

మనసులో ఏదో తెలియని సందిగ్ధం, అతడిని టేబుల్ మీదకు ఒరిగేలా చేసింది. పెదాల మీద చిరునవ్వు బలవంతాన తెచ్చుకుని, మున్నెన్నడూ లేనంత చనువు చూపిస్తూ అడిగాడు. ''ఏమోయ్ ధీరజ్! ఆ అమ్మాయి చూస్తే కోటీశ్వరుడి కూతురు, నువ్వేమో సాధారణ ఉద్యోగివి. ఆమె ఎలా ప్రేమలో పడింది?''

బాస్ తనను అంత చనువుగా అడిగేసరికి, ధీరజ్‌కి ఏదో తెలియని ఉత్సాహం తన్నుకొచ్చింది. అందుకే మనసు విప్పి, నిజం చెప్పడానికే ప్రయత్నించాడు. ''సార్! నాకు తెలిసినంతలో చాలామందికి తాము డబ్బెందుకు సంపాదిస్తున్నారో వారికే తెలియదు. కాకపోతే తాము డబ్బు సంపాదిస్తున్నందున, పిల్లలు కోరినవన్నీ అందిస్తారు. అంతేకాదు, వారు కోరకుండానే కోట్లు సంపాదించి ఇవ్వాలనీ అనుకుంటారు. ఇలా కష్టం తెలియకుండా పిల్లల్ని పెంచటం గొప్ప అని కొందరు అనుకున్నా, కష్టం తెలియకపోవడం వలన ఆనందం విలువా వారికి అంతగా అర్థం కాదు. ఊహ తెలియక ముందే విమానం ఎక్కితే, ఊహ తెలిశాక ఆ ప్రయాణాన్ని ఆస్వాదించలేము. అందుకే చాలా మంది కోటీశ్వరుల పిల్లలకు ఆస్వాదించదగ్గవేవీ కనిపించటం లేదు. అప్పుడే కోటి ఆశలతో ముందుకు సాగే అతి సామాన్యులు వారికి తారసపడతారు. అప్పటివరకూ వారికి తెలియని ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాడు. లగ్జరీ కారుకి బదులు బైక్, స్టార్ హోటల్ స్థానంలో కేఫ్, ప్రేమను పంచే పార్కులు, వయసుకు ఉత్సాహపరిచే స్పర్శాసుఖానందాలు, ప్రతిదీ కష్టపడి సాధించుకునే తపనతో కూడిన జీవితం.

అఫ్‌కోర్స్! ఆ కుర్రాడి లక్ష్యం తన తండ్రి ఆస్తి అని ఆ అమ్మాయికి తెలియదు కదా? అందుకు ఆ పరిచయం కొత్తగా, గమ్మత్తుగా, తెలియని అనుభూతులతో కూడుకుని ఉంటుంది. దాంతో ఆ కుర్రాడి కోసం ఏదైనా చేయాలనిపిస్తుంది. అవసరపడితే తల్లిదండ్రులనే కాదు ఈ ప్రపంచాన్నే ఎదిరించాలని అనిపిస్తుంది. అలాగని ప్రతి ప్రేమకథ ఇలా ఉంటుందనే అనుకోక్కర్లేదు. ఇలా కూడా ఉండే అవకాశముంది''

ధీరజ్ మాటల్లోని నిజం అర్థమవుతూనే ఉంది. కానీ తన తండ్రి పాత్రను తక్కువ చేసుకోవడం భరించలేకపోతున్నాడు. అందుకే అతికష్టం మీద గొంతు పెగల్చుకుని అడిగాడు. ''అంటే పిల్లలు కోరకుండానే అన్నీ అందించడం, వారు హాయిగా బ్రతకాలనుకుని సంపాదించిపెట్టడం తప్పంటావా ధీరజ్?''

''పిల్లలకు ఆస్తి సంపాదించి ఇవ్వాలనుకోవడం తప్పు కాదు సార్! కానీ వారికి ప్రపంచపు పోకడల గురించి చెప్పకపోవడం తప్పు. వారికి మంచీ-చెడు, కష్టం-సుఖం, అభిమానం-దురభిమానం.. వీటన్నిటి గురించి తెలియజెప్పాలి. వారు వాటిని అర్థం చేసుకునేలా చేయాలి. కానీ నేడు ఎక్కువగా ఏం జరుగుతుందో తెలుసా సార్! పెద్దలు డబ్బు సంపాదించే యంత్రంగా మారిపోయారు.

పిల్లలు వేలు పట్టుకుని ప్రపంచాన్ని చూపించాల్సింది పోయి, ఆ గంటా డబ్బు సంపాదించి ఇద్దామని అనుకుంటున్నారు. పెద్దల తాలూకూ ఈ తరహా పోకడలే పిల్లల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. లోకజ్ఞానం లేకుండా చేస్తున్నాయి. అప్పుడే అలాంటి వాళ్లు నా లాంటి వారి కోసం వెతుకులాడుతున్నారు... '' అతడు క్షణమాగి పూర్తిచేశాడు ''మీ అమ్మాయి శ్రావణి, ఈ ధీరజ్‌ని వెతికి పట్టుకున్నట్టే.''

యధాలాపంగా వింటున్న రామ్మోహన్ ఉలిక్కిపడ్డాడు. అంతలోనే తన చెవులు తనను మోసం చేస్తున్నాయేమోనన్న అనుమానమూ కలిగి, తలెత్తి ధీరజ్‌కేసి చూశాడు.

అతడు నవ్వుతున్నాడు. ఆ నవ్వులోనే అర్థమైపోతోంది.

రామ్మోహన్‌కి ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది. ''శ్రావణి ఇల్లు వదిలింది. ధీ..ర..జ్ కోసమేనా? ఇతడి కారణంగానేగా రెండు రోజులుగా తాము నరకం అనుభవిస్తున్నారు' ఏదో చేద్దామన్నంత కోపం కలిగినా అంతలోనే అతడి మాటలూ మనసులో కదలాడాయి. 'పెద్దలు డబ్బు సంపాదించే యంత్రాలుగా మారిపోయారు. పిల్లల వేలు పట్టుకుని, ప్రపంచాన్ని చూపించాల్సింది పోయి, ఆ గంటా డబ్బు సంపాదించి ఇద్దామని' అంతలోనే మరేదో అనుమానం 'పిల్లల పట్ల పెద్దల బాధ్యత గురించి అంత చక్కగా చెప్పిన ఇతడు, ఆ డబ్బు కోసమే శ్రావణిని ట్రాప్ చేసినట్టూ అన్నాడుగా''

''మీ అనుమానంలో అర్థముంది సార్! కానీ నేనక్కడ లోకం పోకడ గురించి చెప్పానే తప్ప, నేనూ అలాంటివాడినే అవ్వలేదు''

తన మనసులోని మాటలు అర్థం చేసుకున్నట్టే, అతడిలా అనేసరికి రామ్మోహన్ దీర్ఘంగా నిశ్వసించాడు.

''అంతేకాదు సార్! వచ్చే నెలలో మా వివాహం, నేనీ ఉద్యోగం మానేయటం, కొత్త వ్యాపారం ప్రారంభించడం- అన్నీ అబద్ధాలే. మీతో మా ప్రేమ విషయం ఎలా చెప్పాలో అర్థంకాక అలా మొదలుపెట్టాను.. కానీ ఆ తర్వాత చెప్పిన ప్రతి మాటా వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబం. ఐతే శ్రావణి మీద నాకు కలిగిన ప్రేమ స్వచ్ఛమైనది. మీ పట్ల నాకున్న గౌరవం, ఈ క్షణం మీ ముందు నన్నిలా నిలబడేలా చేసింది. ఒక్క మాట నిజం సార్! మీరు అంగీకరిస్తే ఈ క్షణం నుండి మీ అమ్మాయి వేలు పట్టుకుని ఈ ప్రపంచం తాలూకూ మరో కోణం చూపిస్తాను. ఒకవేళ మీరు అంగీకరించకపోతే ...'' అతడు చెప్పడం ఆపాడు.

''ఊ! అంగీకరించకపోతే?'' రామ్మోహన్ రెట్టించాడు.

ధీరజ్ అరచేతులకేసి పది సెకనులు చూసుకున్నాక జవాబిచ్చాడు. ''ఊహు! నిర్ణయించుకోలేకపోతున్నాను సార్''

రామ్మోహన్ కుర్చీలో నుండి లేచాడు.

ధీరజ్, రామ్మోహన్ ముఖంలోకి టెన్షన్‌గా చూస్తున్నాడు.

''మరి.. వచ్చే నెలలో జరిగే నీ పెళ్లికి నేనూ వస్తాను'' అతడు నవ్వేశాడు.

ధీరజ్ రిలీఫ్‌గా ఫీలయ్యాడు.

రామ్మోహన్ మనసులోనే అనుకున్నాడు. 'పిల్లలకు డబ్బు సంపాదించి ఇవ్వడమే కాదు మరేమివ్వాలో నాకర్థమయ్యింది. అదృష్టవశాత్తు శ్రావణి విషయంలో పశ్చాత్తాపపడే అవసరం లేకుండా పోయింది. కానీ పిల్లలకు డబ్బు సంపాదించి ఇస్తే చాలనుకునే ఎందరో తల్లిదండ్రుల విషయంలో..?'

☆

